క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు హెచ్చరికల బోర్డులు



నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో స్టాప్‌బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయా బోర్డులను ఇన్‌స్పెక్టర్ హనీష్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసులకు వాహనదారులు సహకరించాలని సూచించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



జయంతిపురం(జగ్గయ్యపేట): స్థానిక రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలోని సేతురామమ్మాల్ విద్యామందిర్ 32వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆషిష్ కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫరూక్ మహ్మద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మూర్తి రావు, ప్రిన్సిపాల్ ఏలేశ్వరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షునిగా రామకృష్ణ



జగ్గయ్యపేట అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షునిగా దువ్వల రామకృష్ణ, పేట నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకర్ల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి వచ్చిన నియామక ఉత్తర్వుల పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తన నివాసంలో బుధవారం వారికి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కాశి కిషోర్ పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన



జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బుధవారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో కళాజాత నిర్వహించారు. ఓటు ప్రాధాన్యాన్ని పాటలు, నృత్యాల ద్వారా ప్రజలకు వివరించారు. ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కళాజాత కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, దేశపౌరులుగా ప్రతిఒక్కరి బాధ్యత అని సూచించారు. కళాజాత సందర్భంగా ఏర్పాటు చేసిన బెలూన్‌తో కూడిన నమూనా ఈవీఎం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏఈఆర్‌వో, జి.శేషగిరి, ఎలక్షన్ డీటీ కిషోర్‌కుమార్, డీటీ నాగరాజు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలతో సమీక్ష

కంచికచర్ల : పేదల బతుకులు మరింత బాగుండాలంటే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తిరిగి మరోసారి అధికారంలోకి రావాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కంచికచర్లలో బుధవారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ నందిగామను అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకు ప్రతి ఒక్కరూ అండగా ఉండి మరోసారి గెలిపించాలని కోరారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, గుగులోతు ఇందిర, మాడుగుల మధుబాబు, కర్ల మాధవి, నాయకులు చింతా రవీంద్రనాథ్, బండి మల్లిఖార్జునరావు, యర్రంశెట్టి బాలయ్య, తంగిరాల సృజినీకుమార్, వేల్పుల శ్రీనివాసరావు, వేముల గోపీ, మంగినేని శ్రీనివాసరావు, చందు పాల్గొన్నారు.

కన్నులపండువగా రాములోరి కల్యాణం

నందిగామ: శ్రీరామనవమి పండుగను భక్తులు వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువపందిళ్లలో శ్రీరాముడు, సీతాదేవిల ప్రతిమలను ఉంచి భక్తిశ్రద్ధలతో స్వామివార్ల కల్యాణం జరిపించారు. నందిగామ పట్టణంలోని కూరగాయల మార్కెట్ బజారులో వేంచేసియున్న శ్రీసీతారామాంజనేయస్వామి వారి ఆలయంతోపాటు ఆయా రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. పట్టణశివారు అనాసాగరం రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాములోరి మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. అయా మండపాల వద్ద భక్తులు, ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. నందిగామ మండలంలోని రాఘవపురం, అమ్మవారిపాలెం, మాగల్లు, పల్లగిరి, గోళ్ళమూడి, జొన్నలగడ్డ, అంబారుపేట, లింగాలపాడు, పెద్దవరం, అడవిరావులపాడు, మునగచెర్ల, చందాపురం గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని శ్రీరామనవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆయా రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతారాముల కల్యాణోత్సవాలన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికచర్లలోని ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. బాలవినాయకుడు, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, మండలంలోని కీసర, గండేపల్లి, పెండ్యాల, పరిటాల, మోగులూరు, పేరకలపాడు, గొట్టుముక్కల, మున్నలూరు, చెవిటికల్లు గనిఆత్కూరు, కొత్తపేట తదితర గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : శ్రీరామనవమి పురస్కరించుకుని మండలంలో వాడవాడలా రాములోరి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. రామాలయాలకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, మక్కపేట, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయశాఖ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నందిగామలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్ : శ్రీరామ నవమి వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో వాడవాడలా అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ముక్త్యాల రోడ్డులోని శ్రీధనశైల సీతారామస్వామి ఆలయం (పెద్ద రామాలయం)లో శాశ్వత కల్యాణ ధర్మకర్తలు తుమ్మేపల్లి నరేంద్రరావు ఆధ్వర్యంలో అర్చకులు ముడుంబా వరదాచార్యులు స్వామివారికి కల్యాణం జరిపించారు. తుమ్మేపల్లి వంశీయులు అంజనీ ప్రభాకరరావు దంపతులు పీటల మీద కూర్చొనగా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తుమ్మేపల్లి గోపాల్, ఆలయ ఈవో బి.రవీంద్ర బాబు పాల్గొన్నారు. అప్సరా సెంటర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ పిల్లలమర్రి నాగకృష్ణశర్మ ఆధ్వర్యంలోఅర్చకులు అలగిరి యోగానందాచార్యులు స్వామివారి కల్యాణం జరిపించారు. పాలేటి తీరాన ఉన్న వరదాంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం, భారీ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, కొలిమిబజారులో శ్రీసీతారామ మందిరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. వెండిదేవాలయంలో కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన శ్రీసీతారాముకల్యాణోత్సవాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొని పూజలు చేశారు. నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు, పాటి సాంబ, పూసాల పుల్లారావు, స్టీల్‌ప్లాంట్ సుబ్బారావు, లయన్స్‌క్లబ్ రాజు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో..

పెనుగంచిప్రోలు: శ్రీసీతారామచంద్రస్వాముల వారి కల్యాణాన్ని బుధవారం మండలంలోని పలు ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు.స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో స్వామివారు, అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు దంపతులు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులోని పోలీస్‌స్టేషన్ సెంటర్, చెరువుకట్ట బజారులోని రావిచెట్టు సెంటర్, కోదండ రామాలయం, కృష్ణమందిరం, ఎస్సీ కాలనీలు, మండలంలోని ఆయా గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు.



నందిగామ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ..

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం మండలంలోని ఆయా రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి సీతారాముల విగ్రహాలకు అర్చకులు కల్యాణం జరిపించారు. జయంతిపురంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయంలో సీతారాముల కళ్యాణాన్ని గ్రామస్తులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కె.అగ్రహారం రామాలయంలో అర్చకులు మార్తి రామకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో కళ్యాణం జరిపించి భక్తులకు అన్నదానం చేశారు. వేదాద్రి, తిరుమలగిరి గ్రామాల్లోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి, వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కంచికచర్ల బాలవినాయకుడి ఆలయంలో..



ముప్పాళ్లలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో శ్రీరామనవమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో వేంచేసియున్న కోదండరామస్వామి ఆలయం, జుజ్జూరులోని సోమేశ్వరస్వామివారి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలో శ్రీరామనవమి పండుగ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు వీధుల్లో చలువ పందిళ్లు వేసి శ్రీసీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.



వత్సవాయిలోని రామాలయంలో ..



జగ్గయ్యపేటలోని పెద్ద రామాలయంలో..



పేటలోని తొర్రగుంటపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో ..



జగ్గయ్యపేట మండలం కె.అగ్రహారంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



వీరులపాడు మండలం జగన్నాథపురంలో..

అభివృద్ధి చూసి అండగా నిలవండి



ప్రచారం సందర్భంగా ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావును ఆశీర్వదిస్తున్న ప్రజలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామలో చేసిన అభివృద్ధి.. అందించిన సంక్షేమ పథకాలను ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డు, టీకుల తోట గేటు, ఆర్చి రోడ్డు, మసీదు రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన డాక్టర్ జగన్‌మోహన రావుకు మహిళలు హారతిచ్చి దీవెనలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహన రావు మాట్లాడుతూ నందిగామ ప్రజల వైద్యారోగ్య అవసరాల దృష్ట్యా సకలవసతులతో కూడిన 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధిని చేయడంతోపాటు అనాసాగరం, 18వ వార్డు పరిధిలో రెండు అర్బన్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. రూ.34కోట్లతో చేపట్టిన 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ బండారు గంగమ్మ, వార్డు కన్వీనర్లు నాదెండ్ల నరేంద్ర, బండారు వెంకట్రావ్, నాయకులు చిరుమామిళ్ల చైతన్య కుమార్, వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఓర్సు జ్వాలా, కన్నెకంటి జీవరత్నం, బాపట్ల సాంబయ్య, షేక్ మున్నా, షేక్ యాకుబ్‌అలీ, ఓర్సు కొండ, షేక్ ఫాతిమా, షేక్ మున్నా, మన్నెం దాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇత్తడి కవచాలు, మకర తోరణాలు సమర్పణ



గంపలగూడెం: గంపలగూడెం భజన మందిరంలోని సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్ విగ్రహాలకు స్థానిక వికాస తరంగిణి కమిటీ వారిచే ఐదు ఇత్తడి కవచాలు, రెండు మకర తోరణాలు అందజేశారు. అర్చకులు బాదంపూడి శివరామలింగప్రసాద్ వాటికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దేవతామూర్తులకు అలంకరించారు. భజన మందిరం కమిటీ నిర్వాహకులు చారుగుండ్ల చిన్నహనుమంతరావు, వికాస తరంగిణి మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నెమలిలో వైభవంగా విగ్రహ ఆవిర్భావ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో నెమలి వేణుగోపాలుడు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1952లో శ్రీరామ నవమి రోజు స్వామి భూమి నుంచి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇచ్చారు. దీంతో ప్రతి ఏటా విగ్రహ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తారు. తెల్లవారు ఝామున సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే ప్రారంభించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం కనులవిందుగా జరిపారు. అనంతరం నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరణ చేయగా భక్తులు స్వామిని దర్శించుకొని తరించారు. మధ్యాహ్నం రాజ్యలక్ష్మీదేవి సామూహిక కుంకుమార్చన చేశారు. సంప్రదాయబద్ధంగా తొమ్మిది రకాల ప్రత్యేక ప్రసాదాలను తయారుచేసి స్వామికి నివేదన సమర్పించారు. అనంతరం వాటిని భక్తులకు వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నందిగామలో 2,03,437 మంది ఓటర్లు



మాట్లాడుతున్న నందిగామ ఆర్‌ఓ రవీంద్రరావు

నందిగామ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమవుతుందని నందిగామ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెలవు దినం మినహా గురువారం నుంచి ఈనెల 25వతేదీ వరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం మూడుగంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 2,03,437 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పురుష ఓటర్లు 98,486 మంది, మహిళలు 1,04,945మంది, థర్డ్‌జెండర్‌ఓటర్లు ఆరుగురు ఉన్నట్లు వివరించారు. 41మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 77 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా 125 ఫిర్యాదులు అందగా, అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఇప్పటివరకు రూ.8.97లక్షల నగదు, 174 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాని ఆర్‌ఓ కోరారు.

పేటలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



పెనుగంచిప్రోలు/ జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అదేరోజు నుంచి నామినేషన్లు దాఖలు చేయవచ్చు. జగ్గయ్యపేట శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులు జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3గంటల లోపు తమ నామినేషన్ పత్రాలను సమర్పించాల్సి ఉంది. నామినేషన్ల స్వీకరణ కోసం ప్రత్యేకంగా ఓ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఆర్‌ఓ కార్యాలయం వద్ద 100 మీటర్ల పరిధిలోకి అభ్యర్థికి చెందిన మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. కార్యాలయం వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుంది.నామినేషన్ కోసం నిర్దేశించిన ఫారంలో అభ్యర్థులు తమ వివరాలు నింపాలి. ఒకటికి రెండుసార్లు పరిశీలించుకుని అన్నీ సక్రమంగా ఉన్నాయో, లేవో నిర్ధారించుకున్న తరువాత నామినేషన్ దాఖలు చేయాలి. అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5 వేలు డిపాజిట్ మొత్తం చెల్లించాలి. డిపాజిట్ సొమ్ముకు ఆర్‌ఓ వద్ద నగదు రూపంలో చెల్లించి రసీదు పొందవచ్చు లేదా ట్రెజరీలో చెల్లించి రశీదు తీసుకోవచ్చు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో ఆర్‌వో ప్రమాణం తీసుకుంటారు. ముఖ్యంగా ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థులు తమ ఆస్తులు, నేరచరిత్ర తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలి. ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా వారి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసి ఎన్నికల్లో విజయం సాధించినా ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల నామినేషన్ పత్రాల్లో అభ్యర్థులు తమ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

పటిష్ట బందోబస్తు ..

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా గురువారం నుంచి ఈనెల 25వతేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆర్‌ఓ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. 26వతేదీ నుంచి 29 వతేదీ వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు వీలుందని చెప్పారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద 144 సెక్షన్ అమలుచేస్తున్నట్లు ఆయన వివరించారు. పటిష్ట బందోబస్తు చర్యల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.